01-03-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - అవినాశీ జ్ఞాన రత్నాలు మిమ్మల్ని ధనవంతులుగా (రాజులుగా) తయారుచేస్తాయి, ఇది అనంతమైన స్కూల్, మీరు చదవాలి మరియు చదివించాలి, జ్ఞాన రత్నాలతో జోలెను నింపుకోవాలి"

ప్రశ్న:- ఏ పిల్లలు అందరికీ ప్రియమనిపిస్తారు? ఉన్నతమైన పదవి కొరకు ఏ పురుషార్థం చేయాల్సిన అవసరముంది?

జవాబు:- ఏ పిల్లలైతే తమ జోలెను నింపుకుని అనేకులకు దానమునిస్తారో, వారు అందరికీ ప్రియమనిపిస్తారు. ఉన్నతమైన పదవి కొరకు ఎంతోమంది ఆశీర్వాదాలు కావాలి. ఇందులో ధనానికి సంబంధించిన విషయము లేదు కానీ జ్ఞాన ధనం ద్వారా అనేకుల కళ్యాణం చేస్తూ ఉండండి. ప్రసన్నచిత్తులు మరియు యోగీ పిల్లలే తండ్రి పేరును ప్రఖ్యాతం చేస్తారు.

ఓంశాంతి. ఆత్మిక తండ్రి కూర్చొని ఆత్మిక పిల్లలకు అర్థం చేయిస్తారు. ఇప్పుడు మేము తిరిగి వెళ్ళాలి అని పిల్లలకు తెలుసు, ఇంతకుముందు అస్సలు తెలిసేది కాదు. తండ్రి పిల్లలకు అర్థం చేయిస్తారు, వారు అర్థం చేయించడము కూడా డ్రామానుసారంగా ఇప్పుడు రైట్ అనిపిస్తుంది. ఇంకెవ్వరూ ఈ విధంగా అర్థం చేయించలేరు. ఇప్పుడు మనం తిరిగి వెళ్ళాలి. అపవిత్రమైనవారు ఎవ్వరూ తిరిగి వెళ్ళలేరు. ఈ జ్ఞానం కూడా ఈ సమయంలోనే లభిస్తుంది మరియు దీనిని ఒక్క తండ్రి మాత్రమే ఇస్తారు. మేము తిరిగి వెళ్ళాలి అని మొట్టమొదట ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. బాబాను పిలిచేవారు కానీ ఇంతకుముందు అసలేమీ తెలిసేది కాదు. అకస్మాత్తుగా సమయము వచ్చినప్పుడు బాబా వచ్చేసారు. ఇప్పుడు కొత్త-కొత్త విషయాలను అర్థం చేయిస్తూ ఉంటారు. పిల్లలకు తెలుసు - ఇప్పుడు మనం తిరిగి వెళ్ళాలి, అందుకే ఇప్పుడు పతితుల నుండి పావనులుగా అవ్వాలి లేకపోతే శిక్షలు అనుభవించాల్సి ఉంటుంది మరియు పదవి కూడా భ్రష్టమైపోతుంది. ఇక్కడ ఏ విధంగానైతే రాజుకు మరియు నిరుపేదకు మధ్యన వ్యత్యాసం ఉంటుందో, అలానే అక్కడ రాజుగా మరియు నిరుపేదగా అవుతారు. మొత్తం ఆధారమంతా పురుషార్థముపై ఉంది. ఇప్పుడు తండ్రి అంటారు - మీరు స్వయమే పతితులుగా ఉండేవారు, అందుకే నన్ను పిలిచేవారు. ఇది కూడా ఇప్పుడు మీకు అర్థం చేయిస్తారు. అజ్ఞాన కాలంలో ఇది బుద్ధిలో ఉండదు. తండ్రి అంటారు - ఆత్మ ఏదైతే తమోప్రధానంగా అయ్యిందో, అది సతోప్రధానంగా అవ్వాలి. ఇప్పుడు సతోప్రధానంగా ఎలా అవ్వాలి - ఇది కూడా మెట్ల చిత్రంలో అర్థం చేయించడం జరిగింది. దీనితో పాటు దైవీ గుణాలను కూడా ధారణ చేయాలి. ఇది అనంతమైన స్కూల్. స్కూల్ లో గుడ్ (మంచి), బెటర్ (ఇంకా మంచి), బెస్ట్ (అత్యంత మంచి) అని రిజిస్టర్ ఉంచుతారు. సేవాధారి పిల్లలు ఎవరైతే ఉన్నారో, వారు చాలా మధురముగా ఉంటారు. వారి రిజిస్టర్ బాగుంటుంది. ఒకవేళ రిజిస్టర్ బాగోకపోతే వారు ఉత్సాహంలో ఉండరు. మొత్తమంతా చదువు, యోగము మరియు దైవీ గుణాలపై ఆధారపడి ఉంది. పిల్లలకు తెలుసు - అనంతమైన తండ్రి మమ్మల్ని చదివిస్తున్నారు. మొదట మనం శూద్ర వర్ణానికి చెందినవారిగా ఉండేవారము, ఇప్పుడు బ్రాహ్మణ వర్ణానికి చెందినవారిగా అయ్యాము. ప్రజాపిత బ్రహ్మా పిల్లలమైన మనము బ్రాహ్మణులము - ఇది చాలా మంది మర్చిపోతారు. మీరు తండ్రిని స్మృతి చేస్తారు కావున బ్రహ్మాను కూడా స్మృతి చేయవలసి ఉంటుంది. మేము బ్రాహ్మణ కులానికి చెందినవారము - ఈ నషా కూడా ఎక్కాలి. ఒకవేళ మర్చిపోతే - మేము బ్రాహ్మణ కులానికి చెందినవారము, తర్వాత దేవతా కులానికి చెందినవారిగా అవుతాము అన్న నషా ఎక్కదు. బ్రాహ్మణ కులాన్ని ఎవరు తయారుచేసారు? బ్రహ్మా ద్వారా నేను మిమ్మల్ని బ్రాహ్మణ కులంలోకి తీసుకువస్తాను. బ్రాహ్మణులది వంశము కాదు, ఇది చిన్న కులము. స్వయాన్ని ఇప్పుడు బ్రాహ్మణులుగా భావించినట్లయితే, దేవతలుగా కూడా అవుతారు. తమ వ్యాపారాలలోనే నిమగ్నమైనట్లయితే అన్నీ మర్చిపోతారు. బ్రాహ్మణత్వాన్ని కూడా మర్చిపోతారు. వ్యాపారాల నుండి ఫ్రీ అయ్యి పురుషార్థం చేయాలి. కొంతమందికి వ్యాపారాలలో ఎక్కువ అటెన్షన్ పెట్టాల్సి ఉంటుంది. పని పూర్తి అయిన తర్వాత ఇక స్వయానికి సంబంధించి చూసుకోవాలి. స్మృతిలో కూర్చుండిపోండి. మీ వద్ద బ్యాడ్జ్ బాగుంది, ఇందులో లక్ష్మీ-నారాయణుల చిత్రం కూడా ఉంది, త్రిమూర్తి చిత్రము కూడా ఉంది. బాబా మనల్ని ఈ విధంగా తయారుచేస్తారు! అంతే, ఇదే మన్మనాభవ. కొంతమందికి అలవాటు అయిపోతుంది, కొంతమందికి అలవాటు అవ్వదు. భక్తి అయితే ఇప్పుడు పూర్తయ్యింది. ఇప్పుడు తండ్రిని స్మృతి చేయాలి. ఇప్పుడు అనంతమైన తండ్రి మీకు అనంతమైన వారసత్వాన్ని ఇస్తారు, కావున సంతోషం కలుగుతుంది. కొంతమందికి మంచి తపన ఏర్పడుతుంది, కొంతమందికి చాలా తక్కువ ఏర్పడుతుంది. నిజానికి ఇది చాలా సహజము.

గీత యొక్క ఆది మరియు అంతిమంలోని పదము - మన్మనాభవ. ఇది ఆ గీతా అధ్యాయమే. కేవలం శ్రీకృష్ణుని పేరును వేసేసారు. భక్తి మార్గంలో ఏయే ఉదాహరణలైతే ఉన్నాయో, అవన్నీ ఈ సమయానికి చెందినవే. భక్తి మార్గంలో ఎవ్వరూ - దేహ భానాన్ని కూడా వదలండి, స్వయాన్ని ఆత్మగా భావించండి అని చెప్పరు. ఇక్కడ తండ్రి వచ్చి రాగానే మీకు ఈ శిక్షణను ఇస్తారు. దేవీ-దేవతా ధర్మ స్థాపన మన ద్వారా జరుగుతుందని నిశ్చయము ఉంది. రాజధాని కూడా స్థాపనవుతుంది. ఇందులో యుద్ధము మొదలైన విషయమేదీ లేదు. తండ్రి ఇప్పుడు మీకు పవిత్రతను నేర్పిస్తున్నారు, అది కూడా అర్ధకల్పం నిలుస్తుంది. అక్కడ రావణ రాజ్యమే ఉండదు. వికారాలపై మీరు ఇప్పుడు విజయాన్ని పొందుతున్నారు. మనము కల్పక్రితం ఏ విధంగానైతే రాజధానిని స్థాపన చేసామో, అచ్చంగా అదే విధంగా ఇప్పుడు చేస్తున్నామని మీకు తెలుసు. మన కొరకు ఈ పాత ప్రపంచం సమాప్తం అవ్వనున్నది. డ్రామా చక్రము తిరుగుతూ ఉంటుంది. అక్కడ బంగారమే బంగారము ఉంటుంది. ఒకప్పుడు ఏదైతే ఉండేదో, అదే మళ్ళీ ఉంటుంది, ఇందులో తికమకపడే విషయమేమీ లేదు. మాయామశ్చీంద్ర ఆటను చూపిస్తారు. ధ్యానములో బంగారు ఇటుకలను చూసారు. మీరు కూడా వైకుంఠములో బంగారు మహళ్ళను చూస్తారు. అక్కడి వస్తువులను మీరు ఇక్కడకు తీసుకురాలేరు. అది సాక్షాత్కారము. భక్తిలో మీకు ఈ విషయాల గురించి తెలిసేది కాదు. ఇప్పుడు తండ్రి అంటారు - నేను మిమ్మల్ని తీసుకువెళ్ళేందుకు వచ్చాను. మీరు లేకుండా నాకు ప్రశాంతత అనిపించదు. సమయం వచ్చినప్పుడు - నేను ఇక వెళ్ళిపోవాలి, పిల్లలు చాలా దుఃఖితులుగా ఉన్నారు, పిలుస్తున్నారు అని నాకు ప్రశాంతత లేనట్లు అనిపిస్తుంది. ‘ఇక నేను వెళ్ళాలి’ అని దయ కలుగుతుంది. డ్రామాలో సమయము వచ్చినప్పుడు, ‘ఇక నేను వెళ్ళాలి’ అన్న ఆలోచన కలుగుతుంది. విష్ణు అవతరణ అనే నాటకాన్ని చూపిస్తారు, కానీ విష్ణు అవతరణ అయితే జరగదు. రోజురోజుకు మనుష్యుల బుద్ధి సమాప్తం అవుతూ ఉంటుంది. అసలేమీ అర్థం కాదు. ఆత్మ పతితంగా అయిపోయింది. ఇప్పుడు తండ్రి అంటారు - పిల్లలూ, పావనంగా అవ్వండి, అప్పుడే రామ రాజ్యం వస్తుంది. రాముని గురించి తెలియదు. ఏ శివుడినైతే పూజిస్తున్నారో, వారిని రాముడు అని అనరు. శివబాబా అనడం శోభిస్తుంది. భక్తిలో రసానుభూతి ఏమీ లేదు. మీకు ఇప్పుడు రసానుభూతి కలుగుతుంది. తండ్రి స్వయంగా అంటారు - మధురమైన పిల్లలూ, నేను మిమ్మల్ని తీసుకువెళ్ళేందుకు వచ్చాను. తర్వాత మీ ఆత్మ అక్కడి నుండి తనకు తానే సుఖధామానికి వెళ్ళిపోతుంది. అక్కడ నేను మీకు సహచరునిగా ఉండను. మీ అవస్థ అనుసారంగా మీ ఆత్మ వెళ్ళి మరొక శరీరంలో, గర్భంలో ప్రవేశిస్తుంది. సాగరంలో రావి ఆకుపై శ్రీకృష్ణుడు వచ్చినట్లుగా చూపిస్తారు. సాగరము యొక్క విషయమే లేదు. వారు గర్భంలో చాలా ప్రశాంతంగా ఉంటారు. బాబా అంటారు - నేను గర్భంలోకి వెళ్ళను. నేను ప్రవేశిస్తాను. నేను చిన్న బాలునిగా అవ్వను. నా బదులుగా శ్రీకృష్ణుడిని చిన్న బాలునిగా భావించి మనసును ఆహ్లాదపరుచుకుంటారు. శ్రీకృష్ణుడే జ్ఞానాన్ని ఇచ్చారు అనుకుంటారు, అందుకే వారిని చాలా ప్రేమిస్తారు. నేను అందరినీ నాతో పాటు తీసుకువెళ్తాను. తర్వాత మిమ్మల్ని పంపించేస్తాను. ఇక ఆ తర్వాత నా పాత్ర పూర్తవుతుంది. అర్ధకల్పము ఏ పాత్రా ఉండదు. మళ్ళీ భక్తి మార్గములో పాత్ర ప్రారంభమవుతుంది. ఇది కూడా డ్రామాగా తయారై ఉంది.

ఇప్పుడు పిల్లలకు జ్ఞానాన్ని అర్థం చేసుకోవడము మరియు అర్థం చేయించడము సహజము. ఇతరులకు వినిపిస్తే సంతోషం కలుగుతుంది మరియు పదవి కూడా ఉన్నతమైనది పొందుతారు. ఇక్కడ కూర్చుని విన్నప్పుడు బాగా అనిపిస్తుంది. బయటకు వెళ్ళడంతో మర్చిపోతారు. ఏ విధంగా జైలు పక్షులు ఉంటారు, ఏవో ఒక తప్పుడు పనులు చేసి జైలుకు వెళ్తూనే ఉంటారు. మీ పరిస్థితి కూడా ఇలాగే ఉంటుంది. గర్భంలో ప్రతిజ్ఞ చేస్తారు, తర్వాత అక్కడిది అక్కడే ఉండిపోతుంది. మనుష్యులు పాప కర్మలు చేయకుండా ఉండేందుకని ఈ విషయాలన్నీ తయారుచేసారు. ఆత్మ సంస్కారాలను తనతో పాటు తీసుకువెళ్తుంది. అందుకే కొందరు బాల్యము నుండే పండితులుగా అయిపోతారు. ఆత్మ నిర్లేపి అని మనుష్యులు భావిస్తారు. కానీ ఆత్మ నిర్లేపి కాదు. మంచి లేక చెడు సంస్కారాలను ఆత్మయే తీసుకువెళ్తుంది, అందుకే కర్మలను అనుభవిస్తుంది. ఇప్పుడు మీరు పవిత్ర సంస్కారాలను తీసుకువెళ్తారు. మీరు చదువుకుని పదవిని పొందుతారు. బాబా అయితే ఆత్మల గుంపునంతటినీ తిరిగి తీసుకువెళ్తారు. కొందరే మిగిలి ఉంటారు. వారు చివరిలో వస్తూ ఉంటారు. ఎవరైతే చివరిలో వచ్చేది ఉంటుందో, వారే అక్కడ ఉంటారు కూడా. ఇది మాల కదా. నంబరువారుగా తయారవుతూ ఉంటారు. ఇకపోతే వారిలో ఎవరైతే తయారవుతారో, వారు స్వర్గములో కూడా చివరిలో వస్తారు. బాబా ఎంత బాగా అర్థం చేయిస్తారు, కొంతమందికి ధారణ జరుగుతుంది, కొంతమందికి జరగదు. అవస్థ అలా ఉంటే పదవి కూడా అలాంటిదే లభిస్తుంది. పిల్లలైన మీరు దయార్ద్ర హృదయులుగా, కళ్యాణకారులుగా అవ్వాలి. డ్రామాయే అలా తయారుచేయబడి ఉంది. ఎవరిపైనా దోషము వేయడానికి లేదు. కల్పక్రితము ఎంతైతే చదువుకొని ఉంటారో, అంతే చదువుకుంటారు. అంతకన్నా ఎక్కువ చదవలేరు. ఎంతగా పురుషార్థం చేయించినా మార్పు ఏమీ ఉండదు. కానీ ఎవరికైనా వినిపిస్తే మాత్రం మార్పు వస్తుంది. నంబరువారుగా

అయితే ఉండనే ఉన్నారు. రాజు ఎక్కడ, నిరుపేద ఎక్కడ! ఈ అవినాశీ జ్ఞాన రత్నాలు రాజులుగా తయారుచేస్తాయి. ఒకవేళ పురుషార్థం చేయకపోతే నిరుపేదగా అయిపోతారు. ఇది అనంతమైన స్కూల్. ఇందులో ఫస్ట్, సెకండ్, థర్డ్ ఉంటాయి. భక్తిలో చదువు యొక్క విషయము ఉండదు. అక్కడ అంతా కిందికి దిగజారే విషయమే. కానీ చాలా శోభనీయంగా ఉంటుంది. తాళాలు వాయిస్తారు, మహిమ చేస్తారు, ఇక్కడైతే శాంతిగా ఉండాలి. భజనలు మొదలైనవేవీ లేవు. మీరు అర్ధకల్పం భక్తి చేసారు. భక్తి యొక్క ఆడంబరము ఎంతగా ఉంటుంది. అందరికీ తమ-తమ పాత్ర ఉంటుంది. కొందరు పడిపోతారు, కొందరు ఎక్కుతారు, కొందరి భాగ్యం బాగుంటుంది, కొందరిది తక్కువగా ఉంటుంది. పురుషార్థము అయితే బాబా ఏకరసంగా చేయిస్తారు. చదువు కూడా ఒక్కటే, అలాగే టీచరు కూడా ఒక్కరే. మిగిలినవారంతా మాస్టరులు. ఎవరైనా పెద్ద వ్యక్తి - తీరిక లేదు అని అంటే, ఇంటికి వచ్చి చదివించమంటారా అని వారిని అడగండి. ఎందుకంటే వారికి తమ అహంకారము ఉంటుంది. ఒక్కరిని పట్టుకుంటే ఇతరులపై కూడా ప్రభావము పడుతుంది. ఒకవేళ వారు కూడా ఎవరికైనా - ఈ జ్ఞానం బాగుంది అని చెప్తే, వీరికి కూడా బ్రహ్మాకుమారీల సాంగత్యం అంటుకుంది అని అంటారు, అందుకే కేవలం బాగుంది అని మాత్రం అంటారు. పిల్లలలో యోగ బలము మంచిగా ఉండాలి. జ్ఞానమనే ఖడ్గములో యోగమనే పదును కావాలి. ప్రసన్నచిత్తులుగా మరియు యోగులుగా ఉంటే, వారు పేరును ప్రఖ్యాతం చేస్తారు. నంబరువారుగా అయితే ఉన్నారు. రాజధాని తయారవ్వనున్నది. ధారణ అయితే చాలా సహజము అని తండ్రి అంటారు. బాబాను ఎంతగా స్మృతి చేస్తే, అంత ప్రేమ ఉంటుంది, ఆకర్షణ కలుగుతుంది. సూది శుభ్రంగా ఉంటే అయస్కాంతము వైపుకు ఆకర్షించబడుతుంది. తుప్పు ఉంటే ఆకర్షించబడదు. ఇక్కడ కూడా అలాగే ఉంటుంది. మీరు శుభ్రంగా అయితే మొదటి నంబరులోకి వెళ్ళిపోతారు. తండ్రి స్మృతితో తుప్పు వదులుతుంది.

బలిహారమంతా మీదే గురువు గారు... అన్న గాయనముంది. అందుకే గురు బ్రహ్మ, గురు విష్ణు... అని అంటారు. అక్కడ నిశ్చితార్థం చేయించే గురువు మానవుడు. మీరు శివునితో నిశ్చితార్థం చేసుకున్నారు, బ్రహ్మాతో కాదు. కావున స్మృతి కూడా శివుడినే చేయాలి. మధ్యవర్తి చిత్రం యొక్క అవసరం లేదు. నిశ్చితార్థం పక్కా అయిన తర్వాత ఒకరినొకరు తలచుకుంటూ ఉంటారు, అప్పుడు ఇతనికి కూడా మధ్యవర్తి రుసుము లభిస్తుంది. నిశ్చితార్థం చేయించినందుకు కూడా లభిస్తుంది కదా. ఇంకొకటి వీరిలోకి ప్రవేశిస్తారు, అప్పుగా తీసుకుంటారు కావున వీరు కూడా ఆకర్షిస్తారు. అందుకే పిల్లలకు కూడా అర్థం చేయిస్తారు - ఎంతగా మీరు అనేకుల కళ్యాణం చేస్తారో, అంతగా మీకు ప్రతిఫలం లభిస్తుంది. ఇవి జ్ఞానానికి సంబంధించిన విషయాలు. ఇతరులకు జ్ఞానం ఇస్తూ ఉన్నట్లయితే ఆశీర్వాదాలు లభిస్తాయి. ధనం యొక్క అవసరం లేదు. మమ్మా వద్ద ధనం లేదు కానీ వారు అనేకుల కళ్యాణం చేసారు. డ్రామాలో ప్రతి ఒక్కరికీ పాత్ర ఉంది. కొంతమంది ధనవంతులు ధనాన్ని ఇస్తారు, మ్యూజియంలు తయారుచేయిస్తారు, అప్పుడు అనేకుల ఆశీర్వాదాలు లభిస్తాయి. వారికి మంచి షావుకారు పదవి లభిస్తుంది. షావుకార్ల వద్ద దాస-దాసీలు ఎంతోమంది ఉంటారు. ప్రజలలో షావుకార్ల వద్ద చాలా ధనముంటుంది, అటువంటివారి నుండి అప్పు తీసుకుంటారు. షావుకార్లుగా అవ్వడం కూడా మంచిదే. పేదవారే షావుకార్లుగా అవుతారు. షావుకార్లలో ధైర్యము ఎక్కడ ఉంది! ఈ బ్రహ్మ వెంటనే అంతా ఇచ్చేసారు. ఎవరి చేయి ఈ విధంగా ఉంటుందో (ఇచ్చేవారిగా ఉంటుందో)... అని అంటారు. బాబా వీరిలోకి ప్రవేశించి వీరి నుండి అంతా విడిపించేసారు. కరాచీలో మీరు ఎలా ఉండేవారు? పెద్ద-పెద్ద ఇళ్ళు, కార్లు, బస్సులు మొదలైనవన్నీ ఉండేవి. ఇప్పుడు తండ్రి అంటారు - ఆత్మాభిమానులుగా అవ్వండి. భగవంతుడు మమ్మల్ని చదివిస్తున్నారు అని ఎంత నషా ఎక్కాలి! తండ్రి మీకు తరగని ఖజానాలను ఇస్తున్నారు. మీరు వాటిని ధారణ చేయరు, మీలో ఆ ఖజానాలను అందుకునేంతటి సత్తా లేదు, మీరు శ్రీమతంపై నడవరు. తండ్రి అంటారు - పిల్లలూ, మీ జోలెను నింపుకోండి. వారు శంకరుని ఎదురుగా వెళ్ళి - జోలెను నింపండి అని అంటారు. బాబా ఇక్కడ అనేకుల జోలెను నింపుతారు. బయటికి వెళ్ళగానే ఖాళీ అయిపోతుంది. తండ్రి అంటారు - మీకు చాలా భారీ ఖజానాను ఇస్తాను. జ్ఞాన రత్నాలతో మీ జోలెను నింపి-నింపి ఇస్తాను. అలా ఇస్తున్నప్పటికీ తమ జోలెను నింపుకునేవారు నంబరువారుగా ఉన్నారు. వారు మళ్ళీ దానము కూడా చేస్తారు, అందరికీ ప్రియమనిపిస్తారు కూడా. తమ వద్ద లేనే లేకపోతే ఏమి ఇస్తారు?

మీరు 84 జన్మల చక్రం గురించి మంచి రీతిలో అర్థం చేసుకోవాలి మరియు అర్థం చేయించాలి. ఇకపోతే యోగము విషయంలో శ్రమించాలి. ఇప్పుడు మీరు యుద్ధ మైదానంలో ఉన్నారు. మాయపై విజయము పొందేందుకు యుద్ధం చేస్తారు. ఫెయిల్ అయితే చంద్రవంశములోకి వెళ్ళిపోతారు. ఇది అర్థం చేసుకోవాల్సిన విషయము. బాబా, మీరు ఎంత వారసత్వాన్ని ఇస్తారు అని పిల్లలకు అపారమైన సంతోషం ఉండాలి. లేస్తూ-కూర్చుంటూ మొత్తం రోజంతా ఇది బుద్ధిలో ఉండాలి, అప్పుడే ధారణ జరుగగలదు. యోగము ముఖ్యమైనది. యోగము ద్వారానే మీరు విశ్వాన్ని పవిత్రంగా

తయారుచేస్తారు. జ్ఞానం అనుసారంగా మీరు రాజ్యం చేస్తారు. ఈ ధనము మొదలైనవన్నీ మట్టిలో కలిసిపోనున్నాయి. ఇకపోతే ఈ అవినాశీ సంపాదన అంతా మీతో పాటు వస్తుంది. ఎవరైతే తెలివైనవారిగా ఉంటారో, వారు - మేము బాబా నుండి పూర్తి వారసత్వాన్ని తీసుకుంటాము అని అంటారు. భాగ్యంలో లేకపోతే పైసా విలువ చేసే పదవిని పొందుతారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. మీ చదువు మరియు దైవీ గుణాల రిజిస్టర్ ను మంచిగా ఉంచుకోవాలి. చాలా-చాలా మధురంగా తయారవ్వాలి. మేము బ్రహ్మ ముఖవంశావళి బ్రాహ్మణులము అన్న ఈ నషాలో ఉండాలి.

2. సర్వుల ప్రేమను మరియు ఆశీర్వాదాలను ప్రాప్తి చేసుకునేందుకు జ్ఞాన రత్నాలతో తమ జోలెను నింపుకుని దానమివ్వాలి. అనేకుల కళ్యాణానికి నిమిత్తులుగా అవ్వాలి.

వరదానము:- ప్రతి కర్మలో తండ్రితో భిన్న-భిన్న సంబంధాలలో స్మృతి స్వరూపులుగా అయ్యే శ్రేష్ఠ భాగ్యవాన్ భవ

మొత్తం రోజంతటిలో ప్రతి కర్మలో అప్పుడప్పుడు భగవంతుని సహచరుని రూపాన్ని, అప్పుడప్పుడు జీవిత భాగస్వామి రూపాన్ని, అప్పుడప్పుడు గారాబాల బిడ్డ రూపాన్ని, ఎప్పుడైనా నిరాశ చెందితే సర్వశక్తివంతుని స్వరూపంతో మాస్టర్ సర్వశక్తివాన్ యొక్క స్మృతి స్వరూపాన్ని ఇమర్జ్ చేసుకోండి, అప్పుడు మనసు సంతోషిస్తుంది మరియు తండ్రి తోడును స్వతహాగా అనుభవం చేస్తారు, అప్పుడిక ఈ బ్రాహ్మణ జీవితం సదా అమూల్యమైనదిగా, శ్రేష్ఠ భాగ్యవంతమైనదిగా అనుభవమవుతూ ఉంటుంది.

స్లోగన్:- బ్రహ్మబాబా సమానంగా అవ్వడము అనగా సంపూర్ణత యొక్క గమ్యానికి చేరుకోవడము.